

యానాంలో ఇటీవల రూ.18 వేలకు విక్రయించిన పులస

ఆదివారం ప్రత్యేకం

యాండే.. పులసండే..



పులస... పులసోయ్ పులస... నోరూరించే పులస.. పుస్తెలమ్మయినా కొనుక్కుని తినాల్సిన పులస.. సాధారణంగా ఏ స్వీట్లు గురించో వింటే రక్కున నోరూరుతుంది.. చేపల్లో పులస గురించి వింటే జిహ్వాచాపల్యం ఆగదు.. ఎలాగైనా.. ఎంత పెట్టి కొని అయినా తినాలనిపించే ఈ చేప గురించి ఎంత చెప్పినా తక్కువే.. వర్షాకాలం వస్తే గోదావరికి ఎర్రనీరు ఎలా పోటెత్తుతుందో... పులస కూడా అలా సముద్రం నుంచి గోదావరికి ఎదురీది పులస ప్రియుల నోట్లోకి జారుతుంది.. సాధారణంగా చికెన్..మటన్.. చేప తింటే బయటకొచ్చి దీని గురించి ఎవరూ పెద్ద గొప్పగా చెప్పుకోరు.. కానీ పులస తిన్నవాళ్లు మాత్రం రోజుల తరబడి ఊరంతా చెప్పుకోవడం ఓ ప్రెస్టేజీ కూడా.. గోదారోళ్లకు మహా ఇష్టమైన...ఖరీదైన.. చుట్టాలు, స్నేహితులకు గొప్ప గిఫ్ట్‌లా పేరొందిన పులస సీజన్ ఇప్పుడు గోదావరిలో మొదలైంది. భారీ వర్షాలతో వరద పోటెత్తుతుండడంతో ఒక్కో పులస అలా అలా ఈదుకుంటూ పులసప్రియుల నోటికి చిక్కడానికి ఇప్పుడిప్పుడే కదులుతోంది... పదండి... ఇంకా దీని గురించి చెప్పుకుందాం...

(కాకినాడ/యానాం-ఆంధ్రజ్యోతి)

వానాకాలం వస్తే అందరి నోట్లో నానే పదం పులస. ఇప్పుడు వానాకాలం కావడంతో గోదావరి ఎర్రనీరు సముద్రంలో కలుస్తుండడంతో పులసల సీజన్ మొదలైపోయింది. ఇప్పటికే యానాం గౌతమి గోదావరిలో అక్కడక్కడా పులసలు దొరుకుతున్నాయి. ఇటీవల యానాం మార్కెట్‌లోకి పలువురు వ్యాపారులు పులసలను తెచ్చి విక్రయించారు. వేలు ఖర్చుపెట్టి మరీ ఈ చేపలు కొనేందుకు ఎగబడ్డారు. వాస్తవానికి పుస్తెలమ్మయినా పులస తినాలి అనేది గోదావరి జిల్లాల్లో పులస చేప కోసం వినబడే నానుడి. ఎందుకంటే దీని ధర ఎంతకు ఎగబాకుతుందో ఎవరికీ తెలియదు. చేపలను మార్కెట్లో ఇలా వెళ్లి అలా తెచ్చుకోవచ్చు. కానీ పులసను మాత్రం వేలంలోకి వెళ్లి తెచ్చుకోవాలి. ఎందుకంటే దీనికి ఉన్న గిరాకీ అంత మరి. ధనవంతుల నుంచి సెలబ్రిటీల వరకు... మధ్యతరగతి నుంచి సామాన్యుల వరకు పులస వచ్చిందా.. పులస దొరుకుద్దా.. అంటూ ఈ సీజన్‌లో ఆరా తీయడం మామూలుగా ఉండదు. చాలామంది తమ పనుల కోసం ప్రముఖులను ప్రసన్నం చేసుకునేందుకు, కావాల్సిన పనులను చేయించుకునేందుకు ఈ పులస పులను పంపడం ఓ ఆనవాయితీగా మారింది. అంతేకాదండోయ్.. ఈ సీజన్‌లో విదేశాల్లో ఉన్న గోదావరివాసులు తమ వారితో సరదాగా పులస దొరికిందా.. పులస తిన్నారా అని అడగకుండా ఉండరంటే అతిశయోక్తికాదు.

పులసే తినాలా...

అవును.. పులసే తినాలి... ఇది తింటే ఆ రుచే వేరు.. వాస్తవానికి ఇవి వెండి రంగులో ఉంటాయి. ఆరోహక వలస జాతికి చెందిన పులసలు సాధారణంగా సముద్రంలో జీవిస్తాయి. అయితే సంతాన ఉత్పత్తి కోసం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, టాంజానియా వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి హిందూ మహాసముద్రంలో ప్రవేశించి అక్కడ నుంచి బంగాళాఖాతం గుండా వరదల సమయంలో గోదావరిలోకి వచ్చి చేరతాయి. గోదావరి వరదనీరు వచ్చి సముద్రంలో కలిసే సమయంలో గుడ్లు పెట్టిన తర్వాత అక్టోబర్ నాటికి తిరిగి సాగరానికి చేరుకుంటాయి. అలా వెళ్లే క్రమంలో జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వరదలు వచ్చినప్పుడు కొన్ని చేపలు సముద్రం నుంచి గోదారిలో ఎదురీదుకుంటూ వెళ్తూ జాలర్లకు చిక్కుతాయి. పూర్వం సముద్రంలోంచి ఈదుకుంటూ ధవళేశ్వరం బ్యారేజీ వరకు వెళ్లేవి. బ్యారేజీ దిగువన పులసల్లంక అనే లంక కూడా ఉంది. అరుదైన ఈ పులస చేపలు గోదావరిలో తప్ప ఇంకెక్కడా దొరకవు. అందుకే అంత గిరాకీ. వాస్తవానికి పులస సముద్రంలో ఉంటే విలస చేప.. నదిలో దొరికితే పులస అవుతుంది. గత పది రోజుల నుంచి గౌతమి గోదావరిలోకి ఎర్రనీరు రావడంతో పులసలు వచ్చి పడుతున్నాయి. వాస్తవానికి ఈ పులస యానాం వద్ద సముద్రం నుంచి ఎగువకు గోదావరిలో ఎగబాకుతూ ధవళేశ్వరం వరకు ఎదురెళ్తాయి. ఈ క్రమంలో ఎక్కడ మత్స్యకారులకు చిక్కుతుందో తెలియదు. చిక్కిందంటే పంట పండినట్టే.

ఎన్ని ప్రత్యేకతలో..

నదీ ప్రవాహానికి అతివేగంగా ఎదురీదడం ఈ చేప ప్రత్యేకత. పులస చనిపోయినా రెండు రోజుల వరకు కూడా పాడవకుండా ఉండటం మరో విశేషం. అయితే ఈ పులస చేప ధర వేలం పాటలో పాల్గొన్న వ్యక్తుల ఆధారంగా రేటు పెరుగుతుంది. సముద్రానికి దగ్గరగా ఉండే యానాం, కోనసీమ ప్రాంతాల్లో కిలో చేప రూ.25 వేలకు కూడా వెళ్తుంది. ప్రధానంగా అల్లవరం మండలం రెబ్బనపల్లికి చెందిన చేపల వ్యాపారి సాయి ఏటా పులస చేపల వ్యాపారం చేస్తారు. ఇతడికి అనేకమంది నేతలు, ప్రముఖులు ముందే అడ్వాన్సులు ఇచ్చేసి చేప చేజిక్కించుకుంటారు. గతేడాది జూలైలో కోనసీమ జిల్లా వశిష్ఠ గోదావరిలో మలికిపురం మండలం రామరాజులంక గంగపుత్రులకు వలలో కేజీన్నర చేపపడగా రూ.25వేల ధర పలికింది. తాజాగా జూలై 12న యానాం వద్ద కేజీన్నర చేప రూ.18 వేలు పలికింది. గోదావరిలో తీపి నీరు, సముద్రంలో ఉప్పునీరు కలవడంతో ఈ చేప శరీరతత్వం మారుతుంది. అందుకే అంత రుచి. సముద్రం నుంచి గోదావరిలోకి ఎదురీదుకుంటూ వెళ్లడం వలనే పులసలకు అంత టేస్ట్. ఈ పులస చేపల్లో ఆడ, మగ చేపలుండగా, వీటిలో ఆడ చేపకు ధర ఎక్కువ. ఇక పులసను రకరకాలుగా వండి జిహ్వాచాపల్యం తీర్చుకుంటారు. కొందరు వంకాయ, బెండకాయ కలిపి వండుతారు.

అంతకంతకూ మాయం..

కొన్నేళ్లుగా గోదావరిలో పులస లభ్యత తగ్గిపోయింది. సముద్ర జలాలు కాలుష్యం కావడం, చమురు సంస్థల డ్రెడ్జింగ్ వల్ల అనేక చేపలు మరణిస్తున్నాయి. అటు సముద్రం, గోదావరి కలిసే మొగ ప్రాంతంలో ఇసుక మేటలు పేరుకుపోవడంతో పులస గోదావరిలోకి రావడం తగ్గిపోతోంది. అలాగే మత్స్యకారులు భారీ వలలతో వేటాడే సమయంలో తల్లి పులసలు చిక్కడంతో సంతానం తగ్గిపోతోంది. అందుకే వలకు గుడ్డుతో ఉన్న తల్లి చేప కనిపిస్తే నదిలో వదిలేయాలని మత్స్యశాఖ ఎప్పటినుంచో ప్రచారం చేస్తోంది. వాస్తవానికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 2010కి ముందు సరాసరి సీజన్‌లో మూడు టన్నుల పులస చిక్కేది. కానీ ఇప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు క్వింటాళ్లకు పడిపోయింది. వాస్తవానికి కోనసీమ జిల్లాలో యానాం వద్ద, రాజోలు మార్కెట్ పులసలకు పెట్టింది పేరు. కానీ ఎప్పుడోగానీ పులస జాడ ఉండడం లేదు. ఈ ఏడాది ఆరంభంలోనే పులస దొరకడంతో ఈ దఫా చేప లభ్యత పెరిగే అవకాశం ఉందని మత్స్యకారులు ఆశిస్తున్నారు.

- గోదారి ఎర్రనీట్లో సందడి చేస్తోన్న పులస చేప
- గతంతో పోల్చితే ఇవి అరుదుగా దొరుకుతుండడంతో భారీ ధర
- ఇటీవల రూ.18 వేలు పలికిన కేజీన్నర చేప.. గతేడాది ఏకంగా రూ.25 వేలు
- సీజన్ ప్రారంభమవడంతో ఈ దఫా అయినా భారీగా దొరికేనా అని మత్స్యకారుల్లో ఆశ

విలసలకూ యమా డిమాండు

పిఠాపురం/మండపేట, జూలై19: కొంచెం అదే రుచి, అదే మాధుర్యం, పట్టిపట్టి చూస్తేనే కాని తెలుసుకోలేని వైరుధ్యం. అదే ఒడిశా పులస. గోదావరి పులసలను వేలల్లో పెట్టి కొనలేని వారు వీటిని కొని వండుకుంటారు. ఇప్పుడిప్పుడే విలసల విక్రయాలు మొదలయ్యాయి. ఒడిశా ప్రాంతంలో సముద్ర తీరప్రాంతాల్లో చెరువులు తవ్వి పెంచే పులస జాతి చేపలను ఒడిశా పులసలుగా, ఇలసలుగా పిలుస్తారు. కొందరు సముద్రంలో దొరికే విలసలనూ విక్రయిస్తారు. గోదావరి పులస రూ.5 వేల నుంచి పాతిక వేలు ఉంటే, ఒడిశా పులస మాత్రం సైజును బట్టి రూ.500 నుంచి రూ.1500 వరకూ మాత్రమే ఉంటుంది. కొందరు వీటినే పులసలుగా చెప్పి విక్రయించి మోసగిస్తారు. హోటళ్ల వారూ వీటినే పులసలుగా వండి వడ్డిస్తారు.



విలసల విక్రయం

క్షణాల్లో ఘోరం

- ట్రాక్టరును ఓవర్ టేక్ చేయబోయి మోటారుసైకిల్‌ను ఢీకొన్న ఆటో
- మహిళ తలతెగిపడిన వైనం
- ముమ్మిడివరం మండలం అన్నంపల్లి సమీపంలో ఘటన

7

ఏడు ప్రైవేట్ బస్సులకు జరిమానా

- డీటీవో శ్రీనివాసరావు

ముమ్మిడివరం,జూలై 19(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంమండలం అన్నంపల్లి టోల్ ప్లాజావద్ద రవాణాశాఖాధికారులు శనివారం చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు పాటించని ఏడు ప్రైవేటు బస్సులపై కేసులు నమోదుచేశారు. వీటికి రూ.8600 అపరాధ రుసుం విధించినట్టు జిల్లా రవాణాశాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతిసురేష్, కౌశిక్ ఉన్నారు. ఈసందర్భంగా డీటీవో మాట్లాడుతూ అన్నంపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరమన్నారు. మితిమీరిన వేగం, హెల్మెట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి మానవ తప్పిదాలవల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారి భద్రతపై వాహనదారులు అవగాహన, క్రమశిక్షణ అలవరచుకున్నప్పుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. రవాణా భద్రత విషయంలో ఉపేక్షించేది లేదని, నిబంధనలు అతిక్రమించిన వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎప్పుడు కావాలన్నా.. మద్యం

- బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- నిబంధనలకు విరుద్ధంగా 24 గంటలు మద్యం
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు



మామిడికుదురులో మద్యంషాపు వెనుక బెల్టుషాపువద్ద మందుబాబులు

(మామిడికుదురు, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం మద్యం పాలసీలో తీసుకువచ్చిన మార్పుల్లో భాగంగా ప్రైవేటు వ్యక్తులు వేలం పాటలో దక్కించుకున్న షాపులవద్ద నిబంధనలకు విరుద్ధంగా 24గంటలూ మద్యం అందుబాటులో ఉండడంతో మందుబాబులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. జిల్లాలో 146 మద్యం షాపులకు ప్రభుత్వం వేలంపాట నిర్వహించింది. ఈ షాపులు దక్కించుకోవడానికి మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా డీడీలు తీసి వేలంపాటలో షాపులు దక్కించుకున్నారు. డీడీల రూపంలో పోగొట్టుకున్న సొమ్మును రాబట్టుకునేందుకు ఆయా దుకాణాల పరిధిలో విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ బెల్టుషాపులు ఏర్పాటు చేసి సొమ్ములు చేసుకునే పనిలో వ్యాపారస్తులు నిమగ్నమయ్యారు.బెల్టుషాపుల ద్వారా విక్రయిస్తున్న మద్యం సీసాలను ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలు తుంగలోకి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం పాలసీపై తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదన్న విమర్శలున్నాయి. సాక్షాత్తూ ముఖ్యమంత్రి గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తామన్నా అది ప్రకటనగానే ఉండిపోయింది. మామిడికుదురు మండల పరిధిలోని పెదపట్నం, అప్పనపల్లి, పాశర్లపూడి, మామిడికుదురు, గోగన్నమఠం గ్రామాల్లో వేలం పాటలో దక్కించుకున్న వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని మద్యం విక్రయాలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 10గంటల వరకు మాత్రమే మద్యం అమ్మకాలు జరగాల్సి ఉండగా ఆ నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా ఎనీటైమ్ మద్యం(ఏటీఎం) అనేలా జోరుగా అమ్మకాలు సాగిస్తున్నారు. మద్యం షాపు పక్కనే నేరుగా బెల్టుషాపు మాదిరిగా ఏర్పాటుచేసి సీసాకు రూ.10 ఎక్కువ చేసి అమ్ముకుంటూ సొమ్ములు చేసుకుంటున్నారు. గ్రామాల్లో ఉన్న చాలా కూల్‌డ్రింగ్ షాపుల్లో మద్యం అమ్మకాలు జరుగుతున్నా అధికారులు తనిఖీలే చేయడం లేదన్న విమర్శ ఉంది. బెల్టుషాపులపై ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు గళమెత్తారు. సంబంధిత అధికారులను నిలదీశారు. అవినీతి జరుగుతున్నా ఎందుకు దాడులు చేయడం లేదని ప్రశ్నించగా సిబ్బంది కొరత వల్ల క్షేత్రస్థాయిలో మద్యం అనధికార అమ్మకాలపై ఏమీ చేయలేకపోతున్నామని సదరు అధికారి వివరణ ఇచ్చారు. పోలీసులు కూడా మద్యంబెల్టు షాపులపై నియంత్రణ కోల్పోయారు. చాలా ప్రాంతాల్లో బెల్టుషాపులు నిర్వహించేవారు ఎక్సైజ్, పోలీసులకు భారీగా మామూళ్లు ఇస్తుండడంతో వారి వ్యాపారాలు మద్యం షాపుల కంటే జోరుగా సాగిపోతున్నాయి. మంచి ఆదాయాలు సంపాదిస్తున్నారు. ఈ అక్రమ బెల్టు షాపుల వ్యాపారంలో మామూళ్ల వ్యవహారం తిలా పాపం తలాపిడికెడు అన్నట్టు ఉందని మద్యం ప్రియులే ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో బెల్టు షాపుల జోరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బ్రాండెడ్, క్వాలిటీ మద్యం అమ్మకంలోకి రావడంతో మద్యం ప్రియుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దీనికితోడు గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ మద్యం బెల్టుషాపుల్లో విరివిగా దొరకడంతో బెల్టుషాపుల నుంచి అధిక ధరలకు మద్యం కొనుగోలు చేస్తూ తమ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఉదాహరణకు నగరం గ్రామంలో మెయిన్‌రోడ్డులో రెండుచోట్ల కొత్త రోడ్డువైపు రెండుచోట్ల, పెదపట్నం గ్రామంలో రత్నాపురం, కరకట్ట దిగువన ఒక ఇంట్లో, షిర్డిసాయిబాబా ఆలయం పక్కన ఉన్న కూల్‌డ్రింగ్ షాపులో, ఏటిగట్టువద్ద కూల్‌డ్రింక్ షాపులోను అమ్మకాలు జరుగుతున్నాయి. గోగన్నమఠంలో ప్రధాన రహదారి పక్కనే గత ప్రభుత్వ హయాంలో మద్యం షాపు నిర్వహించిన దుకాణంలో బెల్టు షాపును దర్జాగా నిర్వహిస్తున్నా అధికారుల కంట పడకపోవడం ఏంటా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో విచ్చలవిడిగా పెరిగిపోయిన బెల్టు షాపులను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నాం

-ఎస్.దుర్గావరప్రసాద్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టుషాపులపై ఎప్పటికప్పుడు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. అనధికారికంగా బెల్టుషాపులు నిర్వహిస్తే అరెస్టు చేసి జైలుకు పంపిస్తాం. జిల్లాలో బెల్టుషాపుల నిర్వహణకు ఏ విధమైన అనుమతులు లేవు. మద్యం ధరలు పెంచి అమ్మితే చర్యలు తీసుకుంటాం.

ప్లాస్టిక్ నియంత్రణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్



రైతుబజార్‌లో జ్యూట్‌బ్యాగుల విక్రేతతో మాట్లాడుతున్న కలెక్టర్

అమలాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగంవల్ల కాలుష్యం పెరిగి ప్రజలను అనారోగ్యాలకు గురిచేసే పరిస్థితులు తలెత్తుతున్నాయని, ప్లాస్టిక్ నియంత్రణ కోసం ప్రతిఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అమలాపురం పట్టణంలోని రైతుబజార్ నిర్వహణ, ప్లాస్టిక్ బదులు ఇతర సంచుల వినియోగం, వివిధ షాపులను శనివారం ఆయన స్వయంగా పరిశీలించి వ్యాపారులతో ముచ్చటించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా ఆరు మాసాలుగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపడుతున్నామని, నెలలో మూడో శనివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యం అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిర్మూలనా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈవేస్ట్, రీసైక్లింగ్ చాలా అవసరమన్నారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువతతోపాటు ఎన్జీవోలు, కార్పొరేట్ సంస్థలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రైతుబజార్‌లో రైతులకు గిట్టుబాటు ధరతోపాటు వినియోగదారులకు తాజా కూరగాయలు అందుబాటులో ఉండేలా విక్రయాలు చేయాలని సూచించారు. రైతుబజార్‌లోని వివిధ షాపులకు వెళ్లి విక్రయాలు చేస్తున్న వ్యాపారులను వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారిణి కె.విశాలాక్షి, అమలాపురం మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్‌తోపాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఆర్వో ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ

సమాజ భాగస్వామ్యంతోనే ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి అన్నారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో మూడో శనివారం ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమంలో ఆమె పాల్గొని ఉద్యోగ రీత్యా ప్రతిజ్ఞ చేయించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్లాస్టిక్‌ను వాడకాన్ని నిషేధిద్దామనే ఇతివృత్తంతో ప్లాస్టిక్ నిర్మూలనఅంశంపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఏవో విశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్‌లునాగలక్ష్మమ్మ, రమణకుమారి పాల్గొన్నారు.

ఆర్డీవో ఆధ్వర్యంలో...



ఆర్డీవో కార్యాలయ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో మాధవి

ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిరోధిస్తూ కాలుష్య నియంత్రణను అరికట్టాలని అమలాపురం ఆర్డీవో ఎ.మాధవి అన్నారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా ఆర్డీవో కార్యాలయ సిబ్బందితో ప్రమాణం చేయించారు. ప్లాస్టిక్, చెత్త సేకరణ ప్రక్రియను సిబ్బందితో కలిసి ఆమె నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయ ఉద్యోగులు ప్రత్యేక ప్రతిజ్ఞ చేశారు.

రాజ్యాంగ మూలాలను మార్చేందుకు మోదీ కుట్ర

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- అమలాపురంలో పార్టీ జిల్లా మహాసభలు



అమలాపురంలో ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అమలాపురంటౌన్, జూలై19(ఆంధ్రజ్యోతి): భారతరాజ్యాంగం మూలాలను మార్చేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. అధికారంలోకి వచ్చేందుకు అంబేద్కర్ భజనచేసిన ప్రధాని మోదీ ఎన్నికలు కాగానే రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. కోనసీమజిల్లా సీపీఐ రెండో మహాసభలు శనివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగానికి తీవ్ర విఘాతం ఏర్పడిందని, ఆర్‌ఎస్ఎస్ మతతత్వ శక్తులతో చేతులు కలిపి మూలాలను మార్చేందుకు చేస్తున్న కుట్రలను లౌకిక శక్తులు, కమ్యూనిస్టులు, కార్మిక, కర్షక సంఘాలు సంఘటితంగా పోరాటం చేసి తిప్పికొడతామని హెచ్చరించారు. దేశంలో పేదరికం రెండు శాతం మాత్రమే ఉందని, ప్రధాని మోదీ అబద్ధాలు చెబుతున్నారన్నారు. దేశంలో 50కోట్ల మంది పేదలకు ఉచితంగా ఎందుకు బియ్యం ఇస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో దేశంలోని అన్ని ట్రేడ్ యూనియన్లను ఏకం చేసి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న లక్షల కోట్ల నల్లధనాన్ని దేశానికి తీసుకువచ్చి ప్రతి ఒక్కరికీ పంచుతానని ఇచ్చిన హామీని మరిచిపోయారన్నారు. దేశంలో మోదీ వంటి మోసకారి నాయకుడు మరొకరు ఉండరన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మోసకారి పాలన సాగిస్తున్నారన్నారు. ఇప్పటికే 21సార్లు ఢిల్లీ పర్యటన చేసిన ఆయన రాష్ట్రానికి ఏం తెచ్చారో వెల్లడించారని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి ప్రజలను బికారులుగా మారుస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. తొలుత ఈదరపల్లి వంతెన వద్ద చింతపల్లి కృష్ణమూర్తి స్మారక స్థూపంవద్ద నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరాజేంద్రప్రసాద్, పెద్దిరెడ్డి రాము, కె.రామకృష్ణ, వేమగిరి శామ్యూల్,శీలం వెంకటేష్, నిమ్మకాయల శ్రీనివాస్, చెల్లుబోయిన తాతారావు, ఎస్.వరలక్ష్మి, కె.నాగేశ్వరరావు, ఆటోయూనియన్‌జిల్లా నాయకుడు వాసంశెట్టి సత్తిరాజు, వెంకటేష్, వెంకటరమణ పాల్గొన్నారు. జిల్లా మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు.

అప్పుడు వరద.. ఇప్పుడు బురద

- పి.గన్నవరం మండలం బూరుగులంక రేవులో తగ్గిన వరద ఉధృతి
- రహదారి కొట్టుకుపోవడంతో నడిచి వెళ్తున్న స్థానికులు



బూరుగులంక నదీపాయవద్ద నడిచి వస్తున్న లంకగ్రామాల ప్రజలు



బూరుగులంక నదీపాయ వద్ద ఈనెల 12న గోదావరి ఉధృతిలో పడవ ప్రయాణం

పి.గన్నవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆ... నాలుగు లంకగ్రామాలకు వరద వస్తే ఒక బాధ.. పూర్తిగా తగ్గిపోతే మరో బాధ. ఇది డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటిపెదపూడి, ఉడిమూడిలంక గ్రామాల దుస్థితి. ఇటీవలే గోదావరి ఎగువ ప్రాంతాలనుంచి వరద భారీగా రావడంతో బూరుగులంక నదిపాయకు తాత్కాలికంగా వేసుకున్న గట్టు సైతం వరదలో కొట్టుకుపోయింది.దీంతో పది రోజులుగా ఇంజన్ బోటులపైనే ఆ గ్రామస్తులు రాకపోకలు సాగించారు. శుక్రవారం వరద ఉధృతి సాధారణ స్థాయికి చేరుకోవడంతో నదిపాయలో వరదనీరు పూర్తిగా తగ్గిపోయింది. తాత్కాలిక రహదారి లేక పడవ తిరిగే పరిస్థితులు లేకపోవడంతో బురదలోనుంచే బూరుగులంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఉడిమూడిలంక గ్రామస్తులు నడిచివెళ్తూ అవస్థలు పడ్డారు. వంతెన అందుబాటులోకి వస్తే కానీ వీరికి ఈ బాధలు తప్పవు.

గోవిందా..ఈ జర్నీ సరైందా?





రాజమహేంద్రవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి గాంచిన ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి వెళ్లే భక్తులు ప్రమాదం అంచున ప్రయాణం చేయాల్సి వస్తోంది. వాడపల్లికి చేరేందుకు రైలు మార్గాన రాజమండ్రికి చేరుకుంటున్న భక్తులు రైల్వే స్టేషన్ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఆలయానికి పయనమవుతున్నారు. శుక్రవారం రాత్రి వాడపల్లి వెళ్లిపోతే శనివారం ఉదయానికి దర్శనం అవుతుందని శుక్రవారం రాత్రి రైల్వే స్టేషనుకు చేరుకునే విధంగా ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే రాజమండ్రి నుంచి వాడపల్లి వెళ్లేందుకు ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారు. ఆర్టీసీ 5 సర్వీసులను మాత్రమే నడుపుతోంది. దీంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో ఆటోలో 12 నుంచి 15 మందిని ఎక్కించుకుంటున్నారు. కాలు కూడా కదపకుండా రాత్రి వేళ సుమారు గంటన్నర ప్రయాణించాల్సి వస్తోంది. ఏదైనా దుర్ఘటన జరిగిన తర్వాత పరుగుల కంటే ముందస్తుగా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తే మంచిది అని పలువురు గుర్తు చేస్తున్నారు.

క్షణాల్లో ఘోరం.. విషాదం

- ఆటోను ఢీకొన్న మోటారు సైకిల్
- తెగిపడిన మహిళ తల
- యువకుడు మృతి
- కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం లక్ష్మీదేవిలంక సమీపంలో ఘటన

ఓ రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మహిళ తల తెగిపడిన వైనం వెన్నులో వణుకు పుట్టించింది. క్షణాల్లోనే మహిళ, యువకుడి ప్రాణాలను హరించివేసింది. అసలు ఏం జరిగిందంటే..



సంఘటనా స్థలంలో బైక్, పరిశీలిస్తున్న పోలీసులు



ముమ్మిడివరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అన్నంపల్లి పంచాయతీ లక్ష్మీదేవిలంక సమీపంలో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. ఐ.పోలవరం మండలం కేశనకుర్రు జై బుద్ధనగర్‌కు చెందిన పచ్చిమాల లక్ష్మి (49) ముమ్మిడివరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించి ఇంటికి వెళ్లేందుకు ముమ్మిడివరం మార్కెట్ సెంటర్‌లో ఆటో ఎక్కింది. ఆటోలో మహిళతో పాటు వృద్ధుడు, మరో ఇద్దరు ప్రయాణికులు ఉన్నారు. ఆటో మురమళ్ల వైపు బయలుదేరింది. ఇంతలో ఆటో ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా లక్ష్మీదేవిలంక సమీపంలో యానాం వైపు నుంచి మోటారు సైకిల్‌పై వస్తున్న బొడ్డు రాంబాబు (24) ఆటోను ఢీకొన్నాడు. దీంతో ఆటోలో ఉన్న లక్ష్మీ రోడ్డుపై పడింది. ఆటో వెనుక వస్తున్న ధాన్యం లోడు ట్రాక్టరు ఆమె మెడ భాగం పై నుంచి వెళ్లడంతో తల భాగం తెగి 3 మీటర్ల దూరంలో పడగా శరీర భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. రాంబాబు తీవ్రంగా గాయపడగా హైవే వాహనంపై అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. ఆటోలో ఉన్న వృద్ధుడు కూడా స్వల్పంగా గాయపడ్డాడు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా పచ్చిమాల లక్ష్మికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా దిరుసుమర్రు శివారు పల్లిపాలేనికి చెందిన బొడ్డు రాంబాబు యానాం ప్రైవేటు ట్రావెల్స్‌లో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం యానాంలో విధులు ముగించుకుని తిరిగి మోటారుసైకిల్‌పై వస్తుండగా ఈ ప్రమాదంలో కన్నుమూశాడు. ఇద్దరు మరణించడంతో వారి కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

గంజాయితో నలుగురి యువకుల అరెస్ట్

మామిడికుదురు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా నగరంలో గ్రామంలో గంజాయితో నలుగురు యువకులను శనివారం నగరం పోలీసులు అరెస్టు చేశారు. గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు సమాధుల వద్ద యానానికి చెందిన గణపతి వెంకటదుర్గ, పెద్దిరెడ్డి గోవిందరాజు, నాగుల్లంకకు చెందిన యన్నాబత్తుల వెంకట్, మొగులికుదురు గ్రామానికి చెందిన పెమ్మాడి నాగూర్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి 950 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ పేర్కొన్నారు. నిందితులను రాజోలు కోర్టులో రిమాండ్ కోసం హాజరుపరిచామని తెలిపారు.

చింతూరులో ముగ్గురు..

చింతూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు శనివారం 5 కిలోల గంజాయితో ముగ్గురు యువకులను అరెస్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ముగ్గురు యువకులు ఒడిస్సాలో 5 కిలోల గంజాయి కొనుగోలు చేసి వయా చింతూరు మీదుగా తెలంగాణకు తరలిస్తూ వాహన తనఖీల్లో పట్టుపడ్డారని ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు. రామవరానికి చెందిన మాలోత్ సాయినాథ్, తుంగారానికి చెందిన నోముల కృష్ణ, వేల్పుల రామును అదుపులోకి తీసుకుని ద్విచక్ర వాహనం, 4 ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

బాలికపై అత్యాచారం

ఉప్పలగుప్తం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అదే గ్రామానికి చెందిన ఒక బాలుడు అత్యాచారం చేసినట్టు బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కె ప్రసాద్, రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ సీహెచ్.రాజేష్ విచారణ చేపట్టారు.

మహిళ అదృశ్యంపై కేసు

తొండంగి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కుటుంబ సభ్యులు రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేశారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏ.కొత్తపల్లికి చెందిన వీర్ల సుబ్బలక్ష్మి (60) హైదరాబాద్ మల్కాజ్‌గిరి నందు సుమారు 15 ఏళ్లుగా పని చేస్తోంది. ఈ నెల 13న మల్లవరంలో బంధువుల ఇంట జరిగిన వేడుకకు వచ్చింది. తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు ఈనెల 14న అన్నవరం రైల్వేస్టేషన్‌లో కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆమె సోదరుడు అక్కిరెడ్డి అప్పారావు ఎక్కించాడు. మరునటి రోజు ఆమెకు ఫోను చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె భర్త వీర్ల రాజోలు శనివారం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

వాడపల్లి వెంకన్న దర్శనానికి వచ్చి...

గోదావరిలో ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతు

ఎస్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు



పడవపై గాలింపు చేపడుతున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం



దినేష్ (ఫైల్)

ఆత్రేయపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వెంకన్న దర్శనానికి వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థి గోదావరిలో గల్లంతయ్యాడు. తెలంగాణ రాష్ట్ర ఖమ్మం జిల్లా వెనుసూరి మండలం లచ్చన్నగూడెంకి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి పామర్తి దినేష్ (22) ఆరుగురు మిత్రులతో కలిసి సత్తుపల్లి నుంచి కారులో శుక్రవారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం వాడపల్లి వెంకన్న సన్నిధికి బయలుదేరారు. శనివారం వాడపల్లికి చేరుకున్న వారు తెల్లవారుజామున 5 గంటలకు ఆలయంలోకి సమీపంలో ఉన్న గోదావరి నదిలో స్నానానికి దిగారు. అక్కడే ఉన్న పడవపై ఎక్కి కేరింతలు కొట్టారు. దినేష్‌కు ఈత రాకపోవడంతో అక్కడిక్కడే మునిగి గల్లంతయ్యాడు. మిత్రులతో పాటు స్థానికులు దినేష్‌ను కాపాడే ప్రయత్నంచేశారు. ఈ విషయాన్ని ఆలయ సమాచార కేంద్రం వద్దకు తెలియచేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. ఈవో నల్లం సూర్యచక్రధరరావు వివిధ శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. వారందరూ ఘటన స్థలానికి చేరుకున్నారు. విశాఖపట్నం 16వ బెటాలియన్ ఆర్ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో ఎస్డీఆర్ఎఫ్ బృందం, గజ ఈతగాళ్లు, పోలీస్ సిబ్బంది గల్లంతైన దినేష్ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, మిత్రులు వాడపల్లి చేరుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అక్కడికి చేరుకుని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దినేష్ సోదరుడు శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు.

తారాస్థాయికి పెద్దింట్లమ్మ ఆలయ వివాదం

పోలీసుల అదుపులో ఎన్నారై



వెంకటపతిరాజాను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అంతర్వేది, జూలై 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి మండలం మెండుపాలెం (చిన్నకొల్లేరు) గ్రామంలో శ్రీపెద్దింట్లమ్మ ఆలయం వివాదం తారాస్థాయికి చేరింది. అమ్మవారి ధూపదీప నైవేద్యాలు, ఉత్సవాలు గ్రామస్తులతో నిర్వహించబడేవి. ఇటీవల గ్రామస్తులు 2 వర్గాలుగా మారడంతో ఉత్సవాలు వివాదానికి దారి తీశాయి. వెంటనే ఆర్డీవో, డీఎస్పీ, స్థానిక ఎస్ఐ సమక్షంలో వారికి సర్ధిచెప్పినా వినిపించుకోలేదు. ఆలయాన్ని 7 నెలల క్రితం దేవదాయశాఖకు అప్పగించి వార్షికంగా వచ్చే జాతర మహోత్సవాలు నిర్వహించారు. ప్రస్తుతం ఎండోమెంట్ ఆర్డరును రద్దు చేసి మళ్లీ సింగిల్ కమిటీని నియమించి ఒక వర్గం వారికి అప్పగించారు. రెండో వర్గంవారు వచ్చి పోలీసులను అడగ్గా ఆర్డరు కాపీ ఉన్నదని చెప్పి వారు చూపించకపోవడంతో ఇరు వర్గీయుల మధ్య వివాదం జరిగేలా ఉందని 50మంది పోలీసు సిబ్బందితో వారికి శనివారం ఉదయం సర్ది చెప్పారు. ఆలయ ఆవరణలో చండీహోమం, శాంతిహోమం, అన్నదానం నిర్వహించేందుకు, ఆలయాన్ని శుద్ధి పరిచేందుకు ఒక వర్గానికి చెందినవారు రావడంతో పోలీసులు ఆలయం వద్ద మోహరించారు. ఆదివారం నిర్వహించే కార్యక్రమాలకు పోలీసులు అనుమతులు నిరాకరించడంతో శనివారం మధ్యాహ్నం పోలీసుస్టేషన్‌లో ఎన్నారై యెనుముల వెంకటపతిరాజాతో కలిసి ఒక వర్గం వర్గీయులు పోలీసుస్టేషన్ ముందు బైఠాయించారు. నిరసన వ్యక్తం చేస్తున్న వెంకటపతిరాజా, వర్గీయులు, పోలీసులకు తోపులాట జరిగింది. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని వెంకటపతిరాజా, 21 మంది యువకులు, మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసు వాహనాల్లో వేరే ప్రదేశాలకు తరలించారు.

ముద్రగడకు తీవ్ర అస్వస్థత

కిర్లంపూడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అస్వస్థతకు గురయ్యారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 2రోజుల క్రితం కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. షుగర్ లెవల్స్ పడిపోవడంతో శనివారం రాత్రి ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారని సమాచారం. దీంతో ముద్రగడను కాకినాడ మెడికోవర్ ఆస్పత్రికి తరలించాలన్న వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు అక్కడ చేర్పించినట్టు తెలిసింది. అవసరమైతే అర్ధరాత్రి హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉందని తెలిసింది.

ఆదాయ వనరుల లక్ష్యాల సాధనకు ప్రణాళికలు

మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు

సామర్లకోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలలో ఆదాయ వనరుల వసూళ్ల లక్ష్యాలను సాధించేందుకు సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు వెల్లడించారు. శనివారం కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆర్డీ మాట్లాడుతూ తన రీజియన్ పరిధిలో 7 జిల్లాలకు చెంది 34 మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు ఉన్నాయని ప్రతీనెలా ఆయా మున్సిపాల్టీల్లో అధికారుల పనితీరుపై సమీక్షిస్తూ మెరుగైన ఫలితాల సాధనకు చేపట్టాల్సిన చర్యలను నిర్దేశించడం జరుగుతుందన్నారు. గతంలో ప్లాన్ అనుమతులు పొంది నిర్మించిన భవనాలు తదనంతరం మరిన్ని అంతస్తులు నిర్మించడం లేదా భవన విస్తీర్ణాన్ని పెంచడం వంటి పనులకు చెంది టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలన చేసి పన్నులు పెంపుదల చేపట్టానున్నారు. ట్రేడ్‌లైసెన్స్ రుసుములు వసూళ్ళు, అడ్వర్‌టైజ్ మెంట్ హోర్డింగ్స్‌పై పన్నులు సత్వరం వసూళ్ల నిర్వహించేందుకు లక్ష్యాలు నిర్ధేశిస్తున్నామన్నారు.

'న్యాయ సలహా అనంతరం చర్యలు తీసుకుంటాం'

అన్నవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో కార్మికులకు ఈపీఎఫ్ మొత్తం చెల్లించకుండా నకిలీ రశీదులతో అధికారులను బురిడీ కొట్టించిన వ్యవహారంపై న్యాయసలహా కోరి తదుపరి చర్యలు తీసుకుంటామని ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. శనివారం అన్నవరం సత్యదేవుడి దర్శనానికి విచ్చేసిన పీఎఫ్ అధికారులతో ఈవిషయంపై చర్చించారు. దీనికి సంబంధించి చర్యలపై ఏవిధంగా ముందుకెళ్లాలని కోరగా రాజమండ్రి కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని అనంతరం న్యాయసలహాతో సంబంధిత కాంట్రాక్టర్‌పై ఏ చర్యలు తీసుకోవాలో మంగళవారం నిర్ణయం వెలువడుతుందన్నారు.

డ్వాక్రా యానిమేటర్ అరెస్ట్

కిర్లంపూడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సొమ్ములు కాజేసిన యానిమేటర్‌ను శనివారం కిర్లంపూడి పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన దుర్గ డ్వాక్రా యానిమేటర్‌గా పనిచేస్తు 42 డ్వాక్రా గ్రూపులకు ఇన్‌చార్జిగా ఉంది. బూరుగుపూడిలో 12 గ్రూపులకు 2023లో స్త్రీనిధి ద్వారా లోను ఇప్పించి 8 గ్రూపు సభ్యులకు వేరే డబ్బులు మీ ఖాతాలో పడ్డాయని చెప్పి వారి సంతకాలు, వేలిముద్రలు తీసుకుని వారి వద్ద రూ.20.25లక్షలు కాజేసి గ్రామం వదిలి పారిపోయింది. దీనిపై మే 24న కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, సిబ్బంది దర్యాప్తు చేసి నిందితురాలు దుర్గను అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచారు. ఆమెకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది.


గైట్ అటానమస్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



వేదికపై ముఖ్యఅతిథితో పాటు జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీజీయూ ప్రాంగణంలోని గైట్ అటానమస్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే-2025 వేడుకలు శనివారం జరిగాయి. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ)పూర్వ డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య జయంత్ ఎం.మోదక్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మన దేశంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రకారం ప్రాథమిక స్థాయి నుంచి సెకండరీ స్థాయి వరకు 25కోట్ల మంది విద్యను కొనసా గిస్తున్నా హైస్కూల్ అనంతరం 66శాతం మంది మాత్రమే విద్య ను కొనసాగిస్తున్నారన్నారు. ఉన్నత విద్యను పూర్తి చేసే వారు 25శాతం మాత్రమే ఉన్నారన్నారు.ఈ సంఖ్యను జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం 50శాతానికి పెంచే లక్ష్యంతో ముందు కెళ్తున్నామన్నారు. సమగ్రత, సహకారం, విచరణాత్మకత, బాధ్యత, సృజనాత్మక త అనే ఐదు భవిష్యత్ విజయానికి మూల స్తంభాలన్నారు. మరో ముఖ్యఅతిథి జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జీజీయూ ప్రోఛాన్సలర్ కె.శశికి రణ్ వర్మ, ఉపకులపతి యు. చంద్రశేఖర్, ప్రో వైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎం ఎస్ శర్మ, ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో సీతారాముల కల్యాణోత్సవం



కల్యాణమూర్తులు



భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకస్వామి

ద్రాక్షారామ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో భీమేశ్వరాలయ బాహ్యప్రాంగణంలో ప్రసన్నాంజేయస్వామి సన్నిధిలో భద్రాది సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది.ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న సప్తసప్తాహం ముగింపు సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణాన్ని వందలాది మంది భక్తులు తన్మయత్వంతో తిలకించారు. ఉదయం రథమూ ర్తులను కల్యాణ వేదికపై అధిష్టించారు. అనంత రం గణపతి పూజ, కంకణ, యజ్ఞోపవీత ధారణ తదుపరి సుమూహూర్తం జరిపారు. మాంగల్యధారణ అనంతరం తలంబ్రాలు కార్యక్రమం నిర్వహించారు. భద్రాది ఆలయ ఉప ప్రధానార్చకుడు ఎ.వెంకట శ్రీ నివాస రామానుజాచార్య ఆధ్వర్యం లో వేదపండితులు స్వామి కల్యాణాన్ని వేద మంత్రాలతో జరిపించా రు. సీతారామస్వామికి భీమేశ్వరాలయ సహాయ కమీషనరు ఏవీ దు ర్గాభవానీ పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.కార్యక్రమంలో భద్రాది ఆలయ ఈవో ర మాదేవి, మంచం చినబాబు దంపతులు పాల్గొన్నారు. కల్యాణోత్సవం అనంతరం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో బాలభక్త సమా జం అధ్యక్షుడు బోనం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏపీఎస్ఐడీసీ నుంచి మరో మూడు ఎత్తిపోతలు

రాజమహేంద్రవరం, జూలై 19(ఆంధ్రజ్యో తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉమ్మడి తూర్పుగోదా వరి జిల్లాలో మరో మూడు ఎత్తిపోతల పథకా లు నిర్మించనున్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీ మ జిల్లా అప్పన్నపల్లిలో రూ.60 కోట్లతో 4045 ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చేలా పథకాన్ని ని ర్మించనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం తిమ్మాపురంలో రూ.70 కోట్లతో 7,800 ఎకరాల ఆయకట్టుకు నీరందించే ప్రాజెక్టును నిర్మించనున్నారు. ఏలేరు రిజర్వాయరు నుంచి మొల్లేరు, మల్లవరం, గోవిందపురం గ్రామాల పరిధిలో 9,000 ఎకరాల ఆయకట్టు కోసం మొల్లేరు ఎత్తిపోతల నిర్మిస్తున్నారు. ఇది గోకవరం మండలంలో కొంత, కాకినాడ జిల్లాలో కొంత, ఏజెన్సీ ప్రాంతంలో కొంత మేర విస్తరిం చి ఉంది. దీనికి ఇప్పటికే రూ.136కోట్లు రాగా, రూ.10 కోట్లు ఖర్చు చేశారు. కానీ ధరలు పెరగ డం వల్ల తమకు గిట్టుబాటు కావడంలేదని, కొత్త ఎస్ఎస్ఆర్ రేట్లు ప్రకారం డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టర్ పని ఆపే శాడు. కానీ ఇటీవల కేబినెట్‌లో ఈ పథకాన్ని నిర్మించడానికి ఆమోదించారు. ఈ విషయాన్ని డీఈ పి.దుర్గాగురవయ్య తెలిపారు.

ముగిసిన ఏపీఈఏపీసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు

- కాకినాడలో రెండు సహాయ కేంద్రాలు
- ఆన్‌లైన్‌లో మొత్తం 5,590 మంది విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన
- ఈనెల 22న సీట్ల కేటాయింపు

జేఎన్టీయూకే, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 అడ్మిషన్లకు ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ఆన్‌లైన్ వెబ్‌కౌన్సెలింగ్ ఈనెల 7 ప్రారంభమైంది. 16వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ జరుగ్గా, ధ్రువపత్రాల పరిశీలన ఆన్‌లైన్‌లో 17వరకూ కొనసాగింది. ఈఏపీసెట్ షెడ్యూల్ ప్రకారం శుక్రవారంతో విద్యార్థుల వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ముగియగా శనివారం విద్యార్థులు వెబ్‌ఆప్షన్లను మార్పుచేసుకున్నారు.

●ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కాకినాడ జగన్నాధపురం ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల సహాయకేంద్రంలో వారికి కేటాయించిన 1439 మంది విద్యార్థుల ధ్రువపత్రాలకుగాను 1434 మంది ధ్రువపత్రాలను, కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకేలో గల సహాయ కేంద్రంలో వారికి కేటాయించిన 4167 మంది విద్యార్థుల ధ్రువపత్రాలకుగాను 4156 మంది ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు.

మిగతా షెడ్యూల్ ఇదే...

● సీట్ల కేటాయింపు జూలై 22న జరుగుతుంది. ఈనెల 23నుంచి 26వరకూ ఆయా కళాశాలల్లో రిపోర్టింగ్ చేయాలి. ఆగస్టు 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

రూ. 66.27 లక్షల ఆదాయం

ఆత్రేయపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. మం డుటెండలో గంటల తరబడి అశేష భక్తజనం స్వామివారిని దర్శించుకన్నారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శాసనమండలి సభ్యుడు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు దంపతులు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. తొలుతగా అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదాశీర్వచనం అందుకున్నారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు స్వీకరించారు. వివిధ సేవల ద్వారా శనివారం స్వామివారికి రూ.66,27,595లు ఆదాయం లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

సామాజిక సేవకుడు ఆంజనేయరెడ్డికి ఆంధ్రశ్రీ బిరుదు

సర్పవరంజంక్షన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాలుగా ప్రజల దాహార్తిని తీరుస్తున్న సామాజిక సేవకుడు, నంది అవార్డు గ్రహీత అనపాల ఆంజనేయరెడ్డికి ఆంధ్రశ్రీ బిరుదును పాన్ ఇండియా సోషియా కల్చర్ అసోసియేషన్ ప్రకటించింది. ఈమేరకు శనివారం విజయవాడ ఐలాపురం కన్వెన్షన్ సెంటర్‌లో పాన్ ఇండియా సోషియాకల్చర్ అసోసి యేషన్ వ్యవస్థాపకుడు అద్ధంకి రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన అమరావతి కీర్తి పురస్కార అవార్డుల ప్రధానోత్సవంలో అనపాల ఆంజనేయరెడ్డిని మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఘనంగా సత్కరించి, ఆంధ్రశ్రీ బిరుదు అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఏడాది పొడవునా ప్రయా ణికుల దాహార్తిని తీర్చడమే కాకుండా ఇరవై ఐదేళ్లుగా చలివేంద్రం నిర్వహిస్తున్న ఆంజనేయ రెడ్డిని అభినందించారు. వివిధరంగాల్లో సేవలు అం దించిన వారిని గుర్తించి, పలుఅవార్డులతో ప్రో త్సహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.



ఆంజనేయరెడ్డిని సత్కరిస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

అమలాపురం టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో ఆయాగా పనిచేస్తున్న అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన చప్పిడి లక్ష్మి కుమార్తెతో కలిసి స్కూటీపై వెళ్తుంది. 17వ తేదీ రాత్రి స్థానిక ఎర్రవంతెన వద్ద ఎదురుగా మోటారుసైకిల్ వచ్చి వేగంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. చప్పిడి లక్ష్మి గాయపడింది.

సుపరిపాలనతో పేదల బతుకుల్లో వెలుగు

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- పలుచోట్ల 'సుపరిపాలన' కార్యక్రమాలు

ఉప్పలగుప్తం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏడాది సుపరిపాలనలో పేదల బతుకుల్లో ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సన్నవిల్లిలో శనివారం ఆయన ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈసందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ పుట్టిన రోజు వేడుకలను ఎమ్మెల్యే సమక్షంలో కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నానాజీకి ఎమ్మెల్యే ఆనందరావు కేక్ తినిపించారు. సర్పంచ్ చిక్కం జంగమయ్య, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు గనిశెట్టి రాము, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, సొసైటీ చైర్మన్లు ఆకేటి పెద్ద, చిక్కం ఉమేష్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, కూటమి నాయకులు చిక్కం పుల్లయ్యనాయుడు, గుత్తుల నాగేశ్వరరావు, గనిశెట్టి లలిత, చిక్కం గాంధి, జాన నాగశంకరరావు, అర్జునకృష్ణారావు, సలాది పట్టాభి, తొత్తరమూడి విజయకుమార్‌పాల్గొన్నారు.



ఉప్పలగుప్తం: సన్నవిల్లిలో తల్లికి వందనం లబ్ధిపొందిన కుటుంబంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

కూటమి పాలనలో గ్రామ స్వరాజ్యం

అల్లవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి సుపరిపాలనలో గ్రామాల అభివృద్ధితో గ్రామస్వరాజ్యం సాధ్యమైందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. రెల్లుగడ్డలో శనివారం టీడీపీ సుపరిపాలన తొలి అడుగు ప్రచారం చేశారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, పచ్చిమాల ఏడుకొండలు, మంతెన సురేష్‌రాజు, కళ్లేపల్లి శివరామరాజు, ఎన్.చంటిరాజు, పరసా కిరణ్, నాగరాజు, వేగిరాజు సుబ్బరాజు, తోలేటి నానాజీ, ముత్యాల బాబి, పోతుల నాగరాజు, యాళ్ల కాసుబాబు, కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్, బొంతు సత్యనారాయణ పాల్గొన్నారు.

జైభీమ్‌నగర్‌లో సుపరిపాలన

కాట్రేనికోన, జూలై 19(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రు పంచాయతీ జైభీమ్‌నగర్‌లో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. నాయకులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో వెంట్రు సుధీర్, వెంట్రు వినోద్, సవరపు బాలకృష్ణ, వెంట్రు కార్తీక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే ప్రగతి, సంక్షేమం

మలికిపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే ప్రగతి, సంక్షేమం అమలు జరుగుతాయని టీడీపీ మండల అధ్యక్షుడు అడబాల యుగంధర్ అన్నారు. శంకరగుప్తంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో రాపాక ఆనందకుమార్, దొడ్డా వెంకటసుబ్బారావు, రాపాక ప్రసన్నకుమార్, ముత్యాల వరదరాజు, అడబాల వీర్య, అడబాల జగన్నాథరావు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

అమలాపురం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): గున్నేపల్లి అగ్రహారం గ్రామంలో శనివారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలోతొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలమూరి ధర్మపాల్, మండలశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చొల్లంగి సత్యసాయిబాబా, దేవరపల్లి వీరేష్‌లతో కలిసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీచేసి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీలు బొర్రా ఈశ్వరరావు, యెరుబండి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి రాము, ముత్తాబత్తుల రమణ, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించండి: జేసీ



సభలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అల్లవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని, అందరూ ప్లాస్టిక్ బ్యాగులు, ప్లాస్టిక్ సీసాలు వినియోగాన్ని స్వచ్ఛందంగా నిషేధించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పిలుపునిచ్చారు. అల్లవరం గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ బొమ్మి బాలవేణి అధ్యక్షతన జరిగిన ప్లాస్టిక్ నిషేధ స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర సభలో ఆమె ప్రసంగించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి కర్నీడి ఎన్వీవీఎస్ మూర్తి, జిల్లా పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజులు ప్రసంగించారు. రూ.లక్ష విలువైన జ్యూట్ బ్యాగులను గ్రామంలో పంపిణీకి ముందుకు వచ్చిన దాతలు బండిగుప్తాపు పాండురంగ, రుద్రరాజు గోపాలకృష్ణంరాజులను, స్టీలు వాటరు బాటిళ్లు అందజేసిన కంకిపాటి గోపాలకృష్ణ, కంకిపాటి వీరబాబులను జాయింట్‌కలెక్టర్ నిషాంతి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.లక్ష్మణరావు, తహశీల్దార్ వీవీఎల్ నరసింహం, డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర, సెక్రటరీ ఎస్.రాజమోహన్, ఎంపీటీసీ ఎన్.మౌనికావరలక్ష్మి, రాసూరి రాంబాబు, సుంకర సాయి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర

ముమ్మిడివరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో నగర పంచాయతీ కార్యాలయం నుంచి బళ్లగేటు సెంటర్ వరకు ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లను నిషేధించి జ్యూట్, గుడ్డ, పేపరు సంచులను మాత్రమే వినియోగించాలన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వాడుతున్న పలువురు వ్యాపారస్తుల చేత చలానాలు కట్టించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కాట్రేనికోన, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో ఎస్.సలీంబాషా అన్నారు. చెయ్యేరు, కాట్రేనికోన, దొంతికుర్రు హైస్కూళ్ళను శనివారం ఆయన తనిఖీ చేశారు. బీ, సీ గ్రేడ్ విద్యార్థులను గుర్తించి, వారి కోసం ప్రత్యేక ప్రణాళిక అమలు చెయ్యాలన్నారు. విద్యార్థులు అరగంట ముందుగానే పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. వచ్చే నెలలో జరిగే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చెయ్యాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం గంట వంతున ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వెంకటరమణ, హెచ్ఎంలు టి.వెంకటేశ్వరరావు, అంబ, మిరియం బీబీలు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలి

రాజోలు, జూలై19(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిని దేశం నుంచి పూర్తిగా నిర్మూలించాలని జడ్పీటీసీ మట్టా శైలజ పిలుపునిచ్చారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాజోలు కోలికేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ టి.మణికుమార్ ఆధ్వర్యంలో చెన్నడంలో సర్పంచ్ బడుగు శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం టీబీ వ్యాధిపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా డాక్టర్ మణికుమార్ టీబీ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ బయ్యా సునీత, ఉపసర్పంచ్ పి.ఆదిలక్ష్మి, పి.ఆనందరావు, యు.శ్రీనివాసరావు, కె.పాండురంగారావు, సెక్రటరీ పి.పద్మావతి, ఎంపీహెచ్ఈవో కె.త్రినాథరావు, ఎస్టీఎల్ఎస్ జి.సర్వారాయుడు, ఎంఎల్‌హెచ్‌పీఎస్ దీప్తి, రోజారాణి, లూథియా, దుర్గాభవానీ, ఏఎన్ఎంలు ఓ.మల్లేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ ఎం.ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు: ఎమ్మెల్యే దాట్ల



అనాతవరంలో వాటరు ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. అనాతవరంలో టీడీపీ నాయకుడు గంధం పల్లంరాజు సమకూర్చిన స్థలంలో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాతవరం గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, దాట్ల పృథ్వీరాజ్, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, ఎంపీపీ కోలా గంగాభవానీ, వాసంశెట్టి పట్టాభిరామయ్య, నడింపల్లి సుబ్బరాజు, యాళ్ల ఉదయ్, పేరిచర్ల సురేష్‌రాజు, వడ్లమాని ప్రసాద్, కుంచే శ్రీను, పెయ్యల వెంకటరమణ, మునుకోటి ఏసుబాబు నాయుడు, వలవల శ్రీను, నల్లా అండాళ్లమ్మ, ఉందుర్తి వెంకటలక్ష్మి, దామిశెట్టి శ్రీను, గంధం శ్రీను, దంగేటి పండు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి ద్వారా రూ.2.27కోట్లు సాయం



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ద్వారా ఇప్పటి వరకు నియోజకవర్గంలో పేదలకు రూ.2.27కోట్లు అందించామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో శనివారం రూ.27.69లక్షలు విలువైన చెక్కులను 29 మందికి అందించారు. అనారోగ్యంతో ఉన్న ప్రతి కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఆసుపత్రి బిల్లు తప్పులు లేకుండా మా కార్యాలయానికి తీసుకువస్తే 20 రోజుల్లోనే లబ్ధిదారుడికి సాయం అందుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధితో పాటు ఎల్లప్పుడు ప్రజాసేవలోనే ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో చిట్టూరి శ్రీనివాస్, సర్పంచ్ బొండాడ నాగమణి, సయ్యపురాజు సత్తిబాబు రాజు, సంసాని పెద్దిరాజు, మద్దాల సుబ్రహ్మణ్యం, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, ఆదిమూలం సూరయ్యకాపు, యడ్ల ఏసు, కోట రాజేంద్రప్రసాద్, తాటికాయల శ్రీనివాసరావు, తాటికాయల వెంకటేష్, గిడుగు యువరాజు తదితరులు పాల్గొన్నారు.

చెస్ శిక్షణ తరగతులు ప్రారంభం

అమలాపురం టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీ ఆదివారం అంతర్జాతీయ చెస్ డేను పురస్కరించుకుని కోనసీమ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం కామాక్షీ ప్రేమమందిరం విద్యార్థులకు శనివారం చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.జగదీష్ చెస్ బోర్డులు అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కాట్రేనికోన, జూలై 19(ఆంధ్రజ్యోతి): దొంతికుర్రు శివారు నీతమ్మచెరువుకు చెందిన పాతాల శ్రీనివాసరావుకు రూ.51వేల సీఎం సహాయనిధి చెక్కును శనివారంఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మురమళ్ళ క్యాంపు కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు యనమదల వెంకటరమణ, ఉపాధ్యక్షుడు ముదే నాగముని తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యవంతమైన సమాజం

అయితాబత్తుల ఆనందరావు

అమలాపురం టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. అమలాపురం పురపాలక సంఘం తరపున స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, కౌన్సిలర్లు యేడిద శ్రీను, అబ్బిరెడ్డి చంటి, బొర్రా వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు ఆశెట్టి ఆదిబాబు, భాస్కర్ల రామకృష్ణ, దిన్నాబాబు తదితరులు పాల్గొన్నారు.

నీతిఅయోగ్ సభ్యుడు అరవింద్ పర్యటన

మలికిపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): నీతిఅయోగ్ సభ్యుడు అరవింద్ విర్మానీ శనివారం మలికిపురం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో పనితీరు, కార్యాచరణ, ఈప్రాంత భౌగోళిక స్వరూపం తదితర అంశాల గురించి తహశీల్దార్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. ప్రధానమైన పంటలు, వాటి వివరాలు, ముఖ్యప్రాంతాలు ప్రజల జీవన విధానం, పర్యాటక ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతం గురించి ఆయన అడిగినట్టు తహశీల్దార్ తెలిపారు.

చెరువుల తవ్వకాలు నిలిపివేయండి

ఉప్పలగుప్తం, జూలై 19(ఆంధ్రజ్యోతి): చల్లపల్లిలోకొనసాగుతున్న రొయ్యల చెరువుల తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలంటూ కొందరు రైతులు జిల్లా కలెక్టర్, తహసీల్దార్లకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. 16ఎకరాల్లో గతంలో చెరువులు తవ్వుతుండగా అధికారులు అప్పట్లో అడ్డుకున్నారని అన్నారు. మళ్లీ ఇప్పుడు తవ్వకాలు ప్రారంభించారని, చెరువులు తవ్వితే 150ఎకరాల్లో సాగు విరమించుకోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. బూసి బుజ్జిదొర, వై.రామచంద్రరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

హ్యాపీగానే ఉన్నాం సార్..

ఉప్పలగుప్తం, జూలై 19(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం అందిందా? పుస్తకాలు, బ్యాగ్‌లు ఇచ్చారా? భోజనం గతంలో కంటె బాగుంటుందా? అని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం సన్నవిల్లి వెళ్తూ రోడ్డుపై తనకు ఎదురైన విద్యార్థినులను ప్రశ్నించారు. బడిలో అంతా హ్యాపీగా ఉంది కదా అని అడిగారు. మధ్యాహ్నభోజనం గతంలో కంటె బాగుందని, పుస్తకాలు, బ్యాగ్‌లు ఇచ్చారని ఎంతో హ్యాపీగా ఉందని విద్యార్థినులు బదులిచ్చారు. బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే అన్నారు.

గోవా గవర్నర్ పూసపాటిని కలిసిన ప్రముఖులు

అల్లవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా పూసపాటి అశోక్‌గజపతిరాజును ఆయన స్వగృహంలో కొమరగిరిపట్నానికి చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. దాట్ల శిల్పిరాజు, కొమరగిరిపట్నం లక్ష్మణేశ్వర సహకార సొసైటీ అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, సింహాచలం దేవస్థాన విశ్రాంత అధికారి దాట్ల చిట్టిరాజు, మాజీ వైస్ ఎంపీపీ గుర్రం నరసింహమూర్తిలు అశోక్‌గజపతిరాజును కలిశారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

ఐ.పోలవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు స్వగ్రామం మురమళ్ళలో పర్యటించారు. పితాని వారిపాలెం వాసులు డ్రైనేజీ సమస్యపై ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి వెంటనే పనులు మొదలుపెట్టాలని ఆదేశించారు. జంపన బాబు, రాయపురెడ్డి మాణిక్యం, ఏలూరి మూర్తి, పలివెల త్రినాధరావు, విత్తనాల మూర్తి, గంజా శ్రీను, ధనకొండ నల్లయ్య, పితాని శ్రీనివాస్, తుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

గేదెల్లంకలో క్లస్టర్ సమావేశం

ముమ్మిడివరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు క్లస్టర్ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారులు డి.గౌరీ శంకర్, ఆర్.ఉదయభాస్కర్‌లు పేర్కొన్నారు. గేదెల్లంక స్కూలు కాంప్లెక్సులో 19ప్రాథమిక, 4ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో ముమ్మిడివరం, అయినాపురం, అనాతవరంలలో కూడా క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. మండలంలో నాలుగు కాంప్లెక్సులలో మొత్తం 250 మంది ఉపాధ్యాయులు హాజరు కాగా ప్రధానోపాధ్యాయులు బీర హనుమంతరావు, బి.రామలక్ష్మి, రాధ పాల్గొన్నారు.

'అధికారమే అన్ని సమస్యలకు పరిష్కారం'

మలికిపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిరంతరం దాడులు, అణచివేతకు గురవుతున్న దళితులు రాజ్యాధికారంతోనే సాధికారిత సాధిస్తారని బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు బూసి జాన్‌మోషే అన్నారు. శనివారం విశ్వేశ్వరాయపురంలో జరిగిన బహుజన సమాజ్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కారంచేడులో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. బీఎస్పీ రాజోలు, మలికిపురం అధ్యక్షులు ఆకుమర్తి భూషణం, మోకా శ్రీనుబాబులతో పాటు ఎస్.సత్య, చిట్టిబాబు, డేవిడ్, అవినాష్, రాజకుమార్, రమేష్, శ్యామ్ పాల్గొన్నారు.

సంక్షేమ లబ్ధి అర్హులందరికీ అందించాలి

అమలాపురం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర సూచించారు. శనివారం బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన, పీఎం వీవీఐ పథకాల అమలు తీరును సమీక్షించారు. ఆసుపత్రిలో జరుగుతున్న కాన్పులపై సమీక్ష నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పథకాల అమలుతీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలనచేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆయన వెంట రాయుడు రామకృష్ణమూర్తి, సూపర్‌వైజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

జనసురక్షతో ఖాతాదారులకు ఎంతో మేలు

అమలాపురంరూరల్,జూలై19(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మోదీ ప్రారంభించిన సామాజిక భద్రతా కార్యక్రమమైన బ్యాంకింగ్ జనసురక్షపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ జీబీఆర్ నాయుడు పేర్కొన్నారు. జనుపల్లిలో శనివారం జనసురక్ష శిబిరాన్ని యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన కె.నాగభూషణం విద్యుత్ షాక్‌కు గురై ఈఏడాది మే20న మృతిచెందడంతో ఆయన భార్య లక్ష్మికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా రూ.2లక్షల బీమా పరిహారం అందజేశారు.ఎల్డీఎం కేశవవర్మ, బ్రాంచి హెడ్ కె.శశిధర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు సారె సమర్పణ

అంబాజీపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): మాచవరం గ్రామదేవతలు శ్రీ ఇటికాలమ్మ, శ్రీమహాలక్ష్మి అమ్మవార్లకు ఆషాఢ మాసం సందర్భంగా సారె, చీర సమర్పించారు. గ్రామానికి చెందిన మహిళలు 200రకాల స్వీట్లు, పండ్లు, చలివిడి, పసుపు, కుంకుమ, గాజులతో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవార్కి సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పులతో మహిళలు ఊరేగింపుగా సారెను అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, షైపాల తాతాజీ, అరిగెల సూరిబాబు, కామిశెట్టి పండు, గంద్రోతు శ్రీను, తోట బుజ్జి, పరమేశ్వరరావు, నందెపు శ్రీను, షైపాల నానాజీ, గంద్రోతు దుర్గ, అప్పన శ్రీను, బండారు కొండ, చిరతపూడి హేమలత తదితరులు పాల్గొన్నారు.

గ్రోయిన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

అంతర్వేది, జూలై 19(ఆంధ్రజ్యోతి):అంతర్వేది పల్లిపాలెం గ్రామంలోకి తరచూ గోదావరి పోటునీరు, వరద నీరు చొచ్చుకు రావడంతో 2కిలోమీటర్ల మేర గ్రోయిన్లు, ఏరుపల్లివారి గట్టుకు గ్రావెల్‌రోడ్డు, గోదావరికి సైడు రాడు కట్టుబడి నిర్మాణానికి హెడ్‌వర్క్స్ అధికారుల ఆధ్వర్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు సర్పంచ్ ఒడుగు శ్రీను తెలిపారు. రెండు రోజుల క్రితం కలెక్టర్, ఆర్డీవో హార్బరు, టూరిజం అభివృద్ధికి కృషి చేయడంపై పల్లిపాలెం గ్రామస్తులు హర్షంవ్యక్తం చేశారు.

బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు



మామిడికుదురు, జూలై 19(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేకువజామునే అర్చకులు, వేదపండితులు వేద మంత్రోచ్ఛారణల నడుమ ఘనంగా తొలి హారతి ఇచ్చారు. దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. కొత్త,పాత ఆలయాలు భక్తుల కోలాహలంతో కళకళ్లాడాయి. శనివారం స్వామివారిని 3,800 మంది దర్శించుకుని, నిత్యాన్నదాన పథకంలో 2,500మంది అన్న ప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.7,21,626 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

రూ.లక్ష సహాయం

పి.గన్నవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శివారు మెట్ల కాలనీకి చెందిన అద్దంకి నాగేశ్వరరావు కొంతకాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. జనసేన యూఏఈ ఇన్‌చార్జ్ కేసరి త్రిమూర్తులు, మొగళ్ల చంద్రశేఖర్‌ల బృందం రూ.లక్ష సమకూర్చారు. స్థానిక జనసేన నాయకుడు అల్లాడ రవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం రూ.లక్ష బాధితుడు నాగేశ్వరరావుకు అందించారు.

భీమేశ్వరాలయంలో ఎమ్మెల్సీ పూజలు

ద్రాక్షారామ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శనివారం ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. దర్శనం అనంతరం నంది మండపంలో వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దాం

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యేలు బండారు, వేగుళ్ల



కొత్తపేట మండలం వాడపాలెంలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యానందరావు

మండపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. మండపేట మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమానికి చైర్‌పర్సన్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పట్టణంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్, మెప్మా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ టీ.వి.రంగారావు మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

రాయవరం జూనియర్ కళాశాలలో...

రాయవరం, (ఆంధ్రజ్యోతి): రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.రామారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, జనసేన నేత దేవిశెట్టి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కృషి..

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నియంత్రణతోనే పల్లెల్లో స్వచ్ఛత సాధ్యమవుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం వాడపాలెం సర్పంచ్ త్సామా బాబు అధ్యక్షతన జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్లాస్టిక్ నివారణకు కట్టుబడి ఉంటామంటూ గ్రామ ప్రజలు, స్కూల్ విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం లో నియోజకవర్గ ప్రత్యేకాధికారి బీవీ రమణ, ఎంపీడీవో నరేష్‌కుమార్, ఎంఈవో ఎం.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, మున్సిపల్, మెప్మా సిబ్బంది

తండ్రిపై దాడి కేసులో కుమారుడు అరెస్టు

రాయవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): తండ్రిపై సుత్తితో దాడి చేసి గాయపర్చిన కేసులో కుమారుడిని అదుపులోకి తీసుకున్నట్లు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం...రాయవరం గ్రామానికి చెందిన గంటా శ్రీను ఈనెల 17న తన కుమారుడు పవన్ కల్యాణ్‌ను మందలించడంతో కోపంతో తండ్రిపై పవన్ కల్యాణ్ సుత్తితో దాడి చేసి విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చాడు. తండ్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో నిందితుడు పవన్ కల్యాణ్‌ను అదుపులోకి తీసుకుని అనపర్తి జేఎఫ్‌సీఎం ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం



కపిలేశ్వరపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకి గ్రామం లోనున్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీనివాసుని కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈనెల 21 వరకు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, విశేష గోక్షీరమండపారాధన, కుంభపూజ, శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో వేద మంత్రోశ్చరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని రథోత్సవం, ప్రధాన హోమాలు జరిపారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం అర్హులందరికీ అందేలా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. శనివారం రాయవరం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. సమావేశం లో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిందన్నారు. తొలుత ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని తెలిపారు. ఎమ్మెల్యే వాటిని సమీక్షించడంతో పాటు ఇంటింటికీ రేషన్ పంపిణీపై తహశీల్దారు ఐపీ శెట్టిని ఆరా తీశారు. మండలంలోని పశుసంవర్ధకశాఖ అందుతున్న సేవలను వివరించడంతో పాటు, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, విద్యాశాఖ ద్వారా ప్రస్తుత విద్యా సంవత్సరంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు పంపిణీ, సకాలంలో విద్యార్థులకు బుక్స్ బ్యాగ్‌లు, షూ తదితర కిట్లు అందించామని విద్యాశాఖ అధికారులు సమావేశంలో తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం ఏవిధంగా ఉందనే అంశంతో పాటు వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన, ఏవో కేవీన్ రమేష్ కుమార్, రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణ మూర్తి, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

‘వైసీపీ నేతలు బుద్ధి లోపించి మాట్లాడుతున్నారు’

మండపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితర వైసీపీ నేతలకు బుర్ర పని చేయటం లేదనే అనుమానం కలుగుతోందని ఎమ్మెల్యే వేగుళ్ల ఆరోపించారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన హామీలు అమలు చేయలేదంటూ బొత్స చేసిన ఆరోపణలను ఖండించారు. సూపర్ సిక్స్ అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుంద న్నారు. వైసీపీ నేతల ఆరోపణలను ఆయన ఖండించారు. అధికారం కోల్పోయి మతి భ్రమించినట్టుగా మాట్లాడుతున్న వైసీపీ నేతల తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ సత్యవతి, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డిప్రసాద్, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎస్.వీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని నీటిపారుదల అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్, మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం మండపేటలో జరిగిన వైసీపీ సభలో బొత్స చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. వైసీపీ నాయకులకు పదవిపోయే సరికి ఏమి మాట్లాడుతున్నారో వారికే అర్థంకావడం లేదని విమర్శించారు. సీఎం చంద్రబాబును, డిప్యూటీ సీఎం పవన్‌ను విమర్శిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శనేశ్వరస్వామి ఆదాయం రూ.1.94లక్షలు

కొత్తపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,94,980 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనర్లు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

కె.గంగవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కె.గంగవరంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పెనుగుదురు అంజన మల్టీస్పెషాలిటీ డెంటల్, రామచంద్రపురం కేవీఆర్ ఆసుపత్రి వారు సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శిబిరంలో పలు రకాల వ్యాధులకు పలు రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన చేయాలి

కె.గంగవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవో 1 ఏ. నాగరాజు అన్నారు. శనివారం పామర్రు ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దాసరి శ్రీనివాసు, మేడిశెట్టి పుల్లయ్య, ఓవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో నాగరాజు

సామూహిక గీతా పారాయణం

ఆత్రేయపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ర్యాలీ జగన్మోహని, కేశవస్వామి దేవస్థానంలో శనివారం గీతాపరివార్ సంస్థ ఐదో వార్షికోత్సవం సందర్భంగా సామూహిక గీతా పారాయణం నిర్వహించారు. ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 180 దేశాల్లో ఆన్‌లైన్ ద్వారా భగవద్గీత 18 అధ్యాయాలపై శిక్షణ అందిస్తున్నది. రోజూ నలభై నిమిషాల చొప్పున ఫోన్‌లో నేర్చుకోవచ్చునని సభ్యులు తెలిపారు. అనంతరం గీతాపారాయణం నిర్వహించారు.

ప్లాస్టిక్ కాలుష్య నివారణకు కృషి చేద్దాం

ఆత్రేయపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీడీవో వెంకట్రామన్ పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదాం నినాదంతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవ హారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

రావులపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం జాతీయ రహదారిపై జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రవాణా శాఖాధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, లక్ష్మీశ్రీదేవి, షణ్ముఖశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొత్తపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సంక్షేమం, అభివృద్ధి వైపు దూసుకుపోయిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం కొత్తపేటలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగులో ఇంటింటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమంపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, కంఠంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎమ్మెల్యే అన్నారు. రావులపాలెం మండలం కేతరాజుపల్లిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు

మండపేట (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పథంలో రాష్ట్రం దూసుకుపోతోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలో శనివారం ఆయన 26, 27, 28 వార్డుల్లో పర్యటించారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గడి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పురపాలక సంఘంగా తీర్చిదిద్దుదాం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత పురపాలక సంఘంగా రామచంద్రపురాన్ని తీర్చిదిద్దుదామని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు మున్సిపల్ ఉద్యోగులు, విద్యార్థులు, మెప్మా సిబ్బంది ప్రదర్శన జరిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్లు, పలువురు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

మండపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండపేటలో శుక్రవారం అర్థరాత్రి సమయంలో మద్యం మత్తులో కొంతమంది యువకులు కేపీరోడ్డులోని అంకసాని చెరువు వద్ద రోడ్డుపక్క వున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో నేలకూలింది. ఈ ప్రమాదంలో యువకులకు హాని జరగనప్పటికి కారు ముందుభాగం దెబ్బతింది. ప్రమాదం కారణంగా మూడు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఇది తెలిసిన వెంటనే విద్యుత్ సిబ్బంది చేరుకుని మరమ్మతులు చేపట్టారు. పట్టణ పోలీసులు ఈ ప్రమాదంపై ఆరా తీశారు. ప్రమాదానికి కారణమైన కారు ఎవరదనే దానిపై వారు ఆరా తీశారు. మొత్తం మీద శుక్రవారం అర్థరాత్రి ఘటన పట్టణ ప్రజలను కలవరపాటుకు గురిచేసింది.

దీపం-2 పథకంపై ఎమ్మెల్యే సమీక్ష

మండపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి) దీపం-2 పథకంపై శనివారం మండపేట తహసీల్దార్ కార్యాలయంలో మూడు మండలాల తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, గ్యాస్ డీలర్లతో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో గ్యాస్ లబ్ధిదారులు 81,819 మంది ఉండగా 80,745 మందికి సబ్సిడీ రూపేణా ఇప్పటి వరకు రూ 6,87,23 నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమకాగా వివిధ కారణాలతో 254 మందికి జమకాలేదని అధికారులు చెప్పారు. సమావేశంలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం తహిల్దార్‌లు, తేజేశ్వరరావు, ఐ.పిశెట్టి, శ్రీనివాస్, డిప్యూటి తహసీల్దార్‌లు, గ్యాస్ కంపెని యాజమానులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత సమాజానికి కృషి చేయాలి



అంగరలో ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం తగ్గించి కాలుష్య రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ సందర్భంగా శనివారం అంగరలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి పరిసరాల శుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ అనర్థాలపై షాపుల యజమానులకు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల నీరు, గాలి, భూమి కలుషితం అవుతున్నదని కార్యదర్శి ఆర్.మోహన్ వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యర్రా వీరన్నబాబు, పాఠశాల హెచ్ఎం, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీ

ఆలమూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆలమూరులో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, ఎంఈవోలు అప్పాజీ, సుబ్బరాజు, మండల పరిషత్ ఏవో మోహర్‌ప్రకాష్, మండల పరిషత్ సిబ్బంది వల్లి, వెంకట్‌తోపాటు పలు శాఖల ఉద్యోగులు పాల్గొని స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. గుమ్మిలేరులో ఎంపీటీసీ యర్లగడ్డ రమేష్, పలు శాఖ అధికారుల అధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించారు.

డాక్టర్ శ్రీనివాస్‌కు నివాళి

ఆలమూరు, జూలై 19 (ఆంధ్ర జోతి)): పినపళ్ల పశువైద్యాధికారి, ఏపీ నాన్ గ్రాడ్యుయేట్స్ వెటర్నరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దివంగత ఈదల శ్రీనివాస్‌కు జిల్లా పశువైద్యాధికారులు నివాళులర్పించారు. ఆలమూరులో శనివారం శ్రీనివాస్ సంస్మరణ సభ జరిగింది. జిల్లా పశువైద్యాధికారి కె.వెంకట్రావు, డిప్యూటీ డైరెక్టర్లు ఎల్‌కె.సుధాకర్, జొన్నాడ సత్యనారాయణ, అసిస్టెంటు డైరెక్టర్లు ఒ.రామకృష్ణ, ఎల్.అనిత, వైద్యాధికారులు మోటూరి రామారావు, భానుప్రసాద్, తదితరులు పాల్గొని శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించారు.

భద్రతానియమాలు పాటించాలి

రావులపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు భద్రతా నియమాలు పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. రావులపాలెం- వాడపల్లి రహదారిలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి శనివారం ఈ తనిఖీ జరుగుతాయని తెలిపారు.

సౌకర్యాలపై ఎమ్మెల్యే ఆరా

ఆత్రేయపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి ఆలయంలో శనివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు పర్యటించారు. క్యూలైన్‌లో భక్తులను తాగునీరు, చిన్నారులకు పాలు, బిస్కెట్లు అందిస్తున్నారా అని అడిగారు. క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులను పలకరించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజేశ్వరావు, ఎంపీడీవో వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.